సాక్షి చిత్తూరు

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



గూడు కట్టని 'పట్టు'

పట్టు పురుగుల నుంచి లాలా జలం విడుదల కాకపోవడంతో గూడు కట్టడంలేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు. - 8లో



ఫెన్సింగ్ తొలగింపు

కార్వేటి నగరంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన ఫెన్సింగ్‌ను రెవెన్యూ అధికారులు తొలగించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	24
తిరుపతి	36	26
తిరుమల	31	21
గూడూరు	37	28
నగరి	37	26

న్యూస్‌రీల్

ట్రాన్స్‌కోలో ఉద్యోగోన్నతులు.. బదిలీలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో పరిధిలోని పలువురు అధికారులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ సీఎండీ సంతోష్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పుంగనూరు ఈఈ విజయన్ ఎస్‌ఈగా ఉద్యోగోన్నతిపై శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు ఎస్పీఎంకు డీఈ శ్రీనివాసమూర్తి ఉద్యోగోన్నతిపై ఈఈగా వెళ్లనున్నారు. ఇక్కడకు కదిరి నుంచి డీఈ ఆనంద్ రానున్నారు. మదనపల్లె ఏఏఓ బాలు తిరుపతి ఏఓగా నియమితులయ్యారు. తిరుపతి సర్కిల్ కార్యాలయ వాణిజ్య విభాగం డీఈ శ్రీనివాసన్‌కు సాంకేతిక విభాగం ఈఈగా, తిరుపతి హెచ్‌టీ మీటర్స్ డీఈ విజయభాస్కర్ కార్పొరేట్ కార్యాలయ ఈఈగా ఉద్యోగోన్నతి కల్పించారు. మదనపల్లె ఈఈ రాజశేఖర్‌రెడ్డి రాజంపేటకు బదిలీ కాగా అక్కడి ఈఈ యుగంధర్ ఇక్కడకు రానున్నారు. తిరుపతి సాంకేతిక విభాగం ఈఈ సుబ్బారావు కార్పొరేట్ కార్యాలయ పీఈఎంఎం ఈఈగా బదిలీ అయ్యారు.

పద్మ అవార్డులకు నామినేషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో నామినేషన్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తులు, అంకితభావంతో సమాజసేవ చేస్తున్న వారు ఈ నెల 15వ తేదీ లోపు www.awards.gov.in వెబ్‌సైట్‌లో నామినేషన్ సమర్పించాలని సూచించారు.

వైద్య విధాన పరిషత్‌లో పోస్టుల భర్తీ రద్దు

చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్య విధాన పరిషత్‌లోని పోస్టుల భర్తీ ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ బీఎస్‌కే నాయక్ తెలిపారు. ఈనెల 1వ తేదీన 42 ఖాళీలను అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించారు. కమిటీ తీర్మానం మేరకు ప్రక్రియను రద్దు చేశారన్నారు. దరఖాస్తుదాలు చెల్లించిన డీడీలను రిటర్న్ చేస్తున్నట్లు వెల్లడించారు.

మల్లేశ్వరునికి రూ.7లక్షల విరాళం



విరాళం అందిస్తున్న సెంథిల్‌కుమార్

గుడుపల్లె : మల్లప్పకొండపై వెలసిన శ్రీమల్లేశ్వరస్వామివారి ఆలయ కుంభాభిషేకానికి కుప్పం రెస్కో చైర్మన్ జీఎస్ సెంథిల్‌కుమార్ రూ.7లక్షలు విరాళంగా అందించారు. మంగళవారం ఆయన మల్లప్పకొండపై కుంభాభిషేక ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ సోమశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, సర్పంచ్ అమరనాథ్, దేవప్పనాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్య అభయం!



ప్రజారోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతులు.. పరికరాలను సమకూర్చింది. అవసరాలకు తగ్గట్టు వైద్యసిబ్బందిని నియమించింది. రోగులకు 24/7 సేవలందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల సమగ్ర వివరాలను సేకరించేందుకు ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టింది. వలంటీర్ల ద్వారా పక్కాగా సర్వే చేయించేందుకు సన్నద్ధమవుతోంది. అనంతరం హెల్త్ క్యాంపులు నిర్వహించి బాధితులకు చికిత్స లందించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది.

- ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- హెల్త్ క్యాంపుల ద్వారా పక్కాగా చికిత్స
- జగనన్న ఆరోగ్య సురక్ష అమలుకు పకడ్బందీ చర్యలు
- 15 నుంచి క్షేత్రస్థాయిలో వలంటీర్ల సర్వే
- మళ్లీ రంగంలోకి ఫ్రంట్‌లైన్ వారియర్స్
- 30 నుంచి వైద్యశిబిరాల నిర్వహణ
- ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ

సాక్షి, తిరుపతి డెస్క్ : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. కోవిడ్ సమయంలో విశేష సేవలందించిన ఫ్రంట్‌లైన్ వారియర్స్‌ను మళ్లీ ముందుకు తీసుకువస్తోంది. ఇంటింటికీ ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి, వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పక్కాగా సర్వే చేపట్టి వ్యాధుల కట్టడికి ఈ నెల 15వ తేదీ నుంచి ఆపరేషన్ ప్రారంభించనుంది. సర్వే పూర్తయిన తర్వాత ఈ నెల 30వ తేదీ నుంచి అన్ని మండల కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.

విప్లవాత్మకమైన మార్పులు

రాష్ట్రం వైపుగా యావత్ దేశం చూసేలా ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు అనే సంస్కరణలు ప్రవేశపెట్టింది. గ్రామీణప్రాంతాల్లోని వారికి సైతం ఆధునిక చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించింది. ఆరోగ్యశాఖలో వేలాది ఖాళీ పోస్టులను భర్తీ చేసింది. పీహెచ్‌సీలను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దింది. రోగుల వద్దకే వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పకడ్బందీగా అమలు. చేస్తోంది. ఈ క్రమంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట మరో బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. పట్టణాలు, పల్లెల్లో ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టింది. ఇంటింటి సర్వేలో డెంగీ, మలేరియా, యూరిన్, బీపీ, మధుమేహం, హిమోగ్లోబిన్, గర్భిణులకు అవసరమైన పరీక్షలు చేయనున్నారు.

హెల్త్ క్యాంపులు ఇలా..

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి మండలాల వారీగా మెగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఇవి ప్రారంభం కావడానికి ముందే ప్రజల ఆరోగ్య నివేదికలు సిద్ధంగా ఉంటాయి. రోగి పేరు నమోదు.చేయగానే మొత్తం సమా చారం తెలుస్తుంది. అధునాతన పరికరాలతో వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేస్తారు. పరీక్షలు, మందులను ఉచితంగానే అందిస్తారు. శిబిరాల్లో 162 రకాల మందులు, 18 రకాల సర్జికల్ వస్తువులు అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా మధుమేహం, క్యాన్సర్, గుండె, కిడ్నీ వాధులుతో బాధపడేవారు, గర్భిణులకు మెరుగైన వైద్యం సేవలు అందించనున్నారు. వైద్యశిబిరాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరవనున్నారు. మొత్తం ప్రక్రియను డీఎంహెచ్ఓ, ఆరోగ్య శ్రీ కో-ఆర్డినేటర్, తహసీల్దార్, ఎంపీడీఓ, పీహెచ్‌సీ వైద్యులు, సీడీపీఓ, ఎంఈఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

ఉమ్మడి జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి 01	టీచింగ్ ఆస్పత్రులు 02
సీహెచ్‌సీలు 15	పీహెచ్‌సీలు 108
ఏరియా వైద్యశాలలు 07	ప్రైవేట్ హాస్పిటళ్లు 3వేలకు పైగా
హెల్త్ క్లినిక్‌లు 903	నిత్యం ఓపీ కేసులు 10వేలకు పైగా

సేవలందించే ఫ్రంట్‌లైన్ వారియర్స్ సమాచారం

స్పెషలిస్ట్ వైద్యులు 549	మెడికల్ ఆఫీసర్లు 258
హెల్త్ అధికారులు 902	ఏఎన్ఎంలు 1,333
ఆశ వర్కర్లు 3,247	వలంటీర్లు 21,417

ప్రక్రియ ఇలా..



- జిల్లావ్యాప్తంగా ఈ నెల 15వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభిస్తారు
- సర్వేలో భాగంగా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళతారు
- ప్రజల ఆరోగ్య సమస్యలపై సమగ్ర సమాచారం సేకరిస్తారు
- స్మార్ట్ ఫోన్ ఉన్న వ్యక్తులతో ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తారు.
- క్యాంపు వివరాలను తెలియజేస్తారు.
- అలాగే ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సైతం ఇంటింటికి వెళ్లనున్నారు.
- ఆయా కుటుంబాల్లోని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.
- పరీక్ష ఫలితాల ఆధారంగా వారి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.
- ఈమేరకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీల్లో మందులు అందజేస్తారు.

వ్యాధుల కట్టడి



సీజనల్ ప్రభావం, జీవనశైలిలో మార్పుల కారణంగా వివిధ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వీటిలో కొన్ని బయటపడకుండా అంతర్గతంగానే వ్యాప్తి చెందుతున్నాయి. చాలా మందికి అవగాహనలోపంతో పరీక్ష చేయించుకోవడం లేదు. బీపీ, మధుమేహం వ్యాధులను ముందుగా గుర్తించక ఇతర రోగాలు కూడా సోకుతున్నాయి. అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కింద ప్రజల ఆరోగ్య స్థితిగతుల సమాచారం సేకరించి, చికిత్స అందిస్తాం. తద్వారా వ్యాధులను కట్టడి చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం.

– రవిరాజు ఇన్‌చార్జి, డీఎంహెచ్ఓ, చిత్తూరు

వైభవంగా గ్రామదేవతల ఉత్సవం



పవిత్రజలాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

నగరి : పట్టణంలోని కేవీపీఆర్ పేటలో గ్రామదేవతలు పొన్నియమ్మ, ఎల్లమ్మతోపాటు ఏకాంబరకుప్పం గ్రామదేవత తొప్పయమ్మకు మంగళవారం వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం ఉదయాన్నే భక్తులు పసుపు వస్త్రాలు ధరించచి నది నుంచి నీటిని బిందెల్లో తీసుకుని ఆలయాలకు చేరుకున్నారు. పుష్పపు త్రిశూలం, అమ్మవార్ల విగ్రహాలు తలపై పెట్టుకుని వచ్చిన భక్తులకు గ్రామపెద్దలు మంగళవాయిద్యాలు, కోలాటాలతోను స్వాగతం పలికారు. ఊరేగింపుగా తీసుకువచ్చిన పవిత్ర జలంతో ఆలయాల్లోని అమ్మవారి ప్రతిమలకు అభిషేకం చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని యువకులు మొక్కులు తీర్చుకునేందుకు గగుర్పొడిచేలా విన్యాసాలు చేశారు. అగ్గిసట్టి తలపై ధరించడం, నోటిలో, శరీరమంతా శూలాలు గుచ్చుకోవడం, వీపుకు, కాళ్లకు, చేతులకు ఇనుప కొక్కీలు పొడిపించుకొని వాహనాలకు వేలాడడం, వీపుకు పొడిపించుకున్న కొక్కీలకు కట్టిన దారాలతో వాహనాలు లాగడం తదితరాలతో అమ్మవారిక మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల విన్యాసాలు చూసేందుకు పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు.

భవన నిర్మాణ పనులు వేగవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దిష్ట ప్రణాళికతో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఇప్పటి వరకు అన్ని పనులకు బిల్లులు మంజూరు చేశామని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంజినీర్లు తగు చర్యలు చేపట్టాలని చెప్పారు. పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయ భవనాల్లో 519 గాను 248 నిర్మాణాలు, 504 రైతు భరోసా కేంద్రాలకు గాను 227, 351 హెల్త్ క్లినిక్‌లకు గాను 66 నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం గృహనిర్మాణశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మొత్తం 73,584 ఇళ్లకు గాను 64,936 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ నాడు-నేడు పనులను త్వరిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా పాఠశాలలను సందర్శించాలని చెప్పారు. సమావేశంలో డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

జీవన స్థితిగతులు మార్చేలా అభివృద్ధి



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యకుమారి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల జీవన స్థితిగతులు మార్చేలా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో రీజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉపాధి పథకంలో ప్రతి రూపాయినీ అర్థవంతంగా ఖర్చు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని స్పష్టం చేశారు. 7,328 ఎకరాల్లో ఉద్యానవన పంటలకు పరిపాలన అనుమతులు మంజూరు చేయగా, 5,094 ఎకరాల్లో సాగుచేస్తున్నారన్నారు. 100 శాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. భూసారం, నీటి లభ్యత మేరకు పంటలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మార్కెటింగ్ శాఖ సహకరించాలని కోరారు. రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్ నిర్మాణాలకు 280 పనులు మంజూరు కాగా 144 పనులు వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. మిగిలిన పనులను అక్టోబర్ 31 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. గుడిపాల, రామకుప్పం, గుడుపల్లె మండలాల్లో ఉద్యానవనశాఖ అధికారుల పనితీరును అభినందించారు. 697 పంచాయతీల్లో 593 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధి హామీ డైరెక్టర్ చిన్నతాతయ్య, వాటర్‌షెడ్ డైరెక్టర్ పీవీఆర్ఎం రెడ్డి, జాయింట్ కమిషనర్ శివప్రసాద్, డిప్యూటీ కమిషనర్ విజిలెన్స్ మల్లికార్జునరెడ్డి, సోషల్ ఆడిట్ డైరెక్టర్ జగదీష్, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల డ్వామా పీడీలు గంగాభవాని, మద్దిలేటి, డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనులకు అభినందన

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో వాటర్‌షెడ్ పనులు పక్కాగా పూర్తి చేసినందుకు కమిషనర్ సూర్యకుమారి అభినందించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లోని వీధి దీపాలకు సోలార్ పెట్టాలని సూచించారు. స్వామిత్వ సర్వేకు పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు అక్రమించిన వారికి నోటీసులు జారీ చేసి 21 రోజుల్లో ఖాళీ చేయించాలన్నారు. ప్రతి పంచాయతీకి ఫేసుబుక్, ట్విటర్ అకౌంట్స్ ఓపెన్ చేసి అందులో అభివృద్ధి పనులను పోస్ట్ చేయాలని కోరారు. నీటి సరఫరా కోసం ప్రతిపాదన మేరకు త్వరలోనే రూ.27 కోట్లు మంజూరు చేస్తామని తెలిపారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల డీపీఓలు లక్ష్మి, ధనలక్ష్మి, డీఎల్‌డీఓలు రవికుమార్, లక్ష్మీపతి, ఉమాదేవి పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI

SAKSHI DIGITAL MEDIA GROUP

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతిసిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

శిబిరం చిరునామా:

బృందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
డోర్ నెం.6-566/2ఎ, నాగాలమ్మ గుడి ప్రక్కన
సంతపేట, చిత్తూరు
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97037 74402

విద్యుత్ చౌర్యంపై కేసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో సిబ్బంది మొత్తం 3,179 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసినట్లు ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి ఆపరేషన్ పరిధిలో 95, తిరుపతి రూరల్ 72, పుత్తూరు 78, చిత్తూరు అర్బన్ 83, చిత్తూరు రూరల్ 50, మదనపల్లె 64, పీలేరు 22, పుంగనూరు పరిధిలో 84 సర్వీసుల్లో విద్యుతు చౌర్యం, అపరాధరుసుము పరంగా కేసులు బుక్ చేసినట్లు వివరించారు. డెవలప్‌మెంట్ చార్జీలపై 464 కేసులకు గాను రూ.10.17 లక్షలు, విద్యుత్ చౌర్యంపై నమోదు చేసిన 84 కేసులకు రూ.79 వేల జరిమానాగా విధించామని వివరించారు.

ఆన్‌లైన్‌లోనే అనుమతుల దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఏర్పాటుకు, రెన్యూవల్‌కు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తుతోపాటు ధ్రువీకరణ పత్రాలను www.cse.ap. gov.in/ psis వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

బ్రహ్మోత్సవాలకు బస్సులు సిద్ధం చేయండి

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు బస్సులు సిద్ధం చేయాలని జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లాలోని 11 ఆర్టీసీ డిపో గ్యారేజ్ సూపర్‌వైజర్లు, స్టోర్ సూపర్ వైజర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్యారేజ్ సూపర్ వైజర్లు ప్రతి సర్వీస్ కండీషన్‌ను పరిశీలించాలన్నారు. ప్రధానంగా తిరుమల ఘాట్‌లోకి వెళ్లే సర్వీసులు మధ్యలో ఆగకుండా ముందే చెక్ చేసుకోవాలని ఆదేశించారు. మెకానిక్ చీఫ్ ఇంజినీర్ నరసింహులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4, 5 తేదీల్లో వెంకటగిరి జాతర



పోలేరమ్మతల్లి ఆలయ ముఖద్వారం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతర అక్టోబర్ 4, 5 తేదీల్లో రాష్ట్ర పండుగ హోదాలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జాతర ఏర్పాట్లపై బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్షించనున్నారు. జాతర నిర్వహణక రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు కానున్నాయి. గతంకంటే మిన్నగా జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టనున్నారు.

ఎయిడ్స్ కంట్రోల్ విభాగంలో పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: ఎయిడ్స్ కంట్రోల్ విభాగంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్షయ నివారణాధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐసీటీసీ కౌన్సెలర్, క్లస్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని జిల్లా క్షయ నివారణ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు. www.chittoor.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారమ్ పొందవచ్చని సూచించారు.

ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

నగరి : ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అండర్-17 బాల బాలికలకు ఈనెల 14వ తేదీన యాదమరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో, అండర్-14 విభాగానికి ఈ నెల 15వ తేదీన వడమాలపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపికలు జరగనున్నట్లు వివరించారు. క్రీడాకారులు ఎలిజిబుల్ ఫామ్స్, మిడ్ డే మీల్స్ అక్విటెన్స్ ఫామ్స్, స్టడీ అండ్ కాండక్ట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ తీసుకురావాలన్నారు. కోచ్ కమ్ మేనేజర్లు తమ ప్లేయర్ ఎంట్రీఫామ్, ఎంట్రీ ఫామ్ ఫర్ మండల లెవల్ ఎస్‌జీఎఫ్ గేమ్స్ సమర్పించాలని సూచించారు. వివరాలకు 9849313062, 9490620292, 9010534918 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

భర్త అదృశ్యంపై ఫిర్యాదు


ముబారక్ (ఫైల్)

సదుం: భర్త కనిపించడం లేదని షబానా అనే మహిళ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మారుతి మంగళవారం తెలిపారు. వివరాలు.. స్థానిక కాలేజీ రోడ్డులో టైలరింగ్ దుకాణం నిర్వహిస్తున్న ముబారక్ (40) సోమవారం ఉదయం నుంచి అదృశ్యమైనట్లు భార్య షబానా పేర్కొంది. ఇంట్లోని 70 గ్రాముల బంగారు నగలు మాయమైనట్లు వెల్లడించింది. ఈ క్రమంలో ముబారక్ తమకు రూ.లక్షలు బాకీ ఉన్నాడని పలువురు దుకాణం వద్దకు చేరుకున్నారని వివరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న టి.చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తిని ఎస్ఈబీ అర్బన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ జోగేంద్ర కథనం మేరకు.. రూరల్ మండలం తాళంబేడు వద్ద ఎస్ఐలు బాబు, రాంప్రసాద్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన నిందితుడు మద్యం ప్యాకెట్లు విక్రయించేందుకు తీసుకువస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. 96 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి మద్యం సరఫరా చేసే టి.గుణశేఖర్ అనే వ్యక్తి పరారవగా, అతడిపై కూడా కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్ నిమిత్తం జిల్లా జైలుకు తరలించారు.

గూడు కట్టని పట్టు

పట్టుపురుగుల పెంపకంలో అధిక లాభాలు వస్తుండడంతో పలువురు రైతులు మల్బరీ సాగుపై మక్కువ పెంచుకున్నారు. ఏటా ఆరు నుంచి పది పంటలు పండిస్తూ రూ.లక్షలు ఆర్జించేవారు. అయితే కొన్నాళ్లుగా పట్టు పురుగులు గూడు కట్టక పోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. చంద్రికల్లో వేసినా పరిస్థితిలో మార్పు రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. శాస్త్రవేత్తలు సైతం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి కారణాలను అన్వేషిస్తున్నారు.

- పురుగుల నుంచి రాని లాలాజలం
- చంద్రికల్లో వేసినా ప్రయోజనం శూన్యం
- కారణాలను అన్వేషిస్తున్న శాస్త్రవేత్తలు
- అయోమయంలో పట్టురైతులు


చంద్రికల్లో వేసినా గూళ్లు కట్టని పట్టుపురుగులు


పురుగుల పరిశీలనలో శాస్త్రవేత్తలు (ఫైల్)

పలమనేరు, కుప్పం సెరి కల్చర్ డివిజన్ సమాచారం

- మొత్తం మల్బరీ సాగు: 27వేల ఎకరాలు
- పట్టుపురుగులు పెంచే రైతులు : 13వేలు
- మార్కెట్లకు వచ్చే గూళ్లు నెలకు : 200 మెట్రిక్ టన్నులు

పలమనేరు : జిల్లాలోనే పట్టు పురుగుల సాగుకు పలమనేరు రెవిన్యూ డివిజన్ అనుకూలంగా ఉంటుంది. దీంతో ఇక్కడ పట్టు పురుగుల సాగు చేసే రైతులు అధిక సంఖ్యలో ఉన్నారు. గతంలో పట్టు పరిశ్రమశాఖ ద్వారానే పురుగుల గుడ్లు (మట్టి) రైతులకు అందించేవారు. అయితే హైబ్రిడ్ రకాల గుడ్లు అందుబాటులోకి రావడంతో ప్రైవేటు చాకీ సెంటర్లు ఈ ప్రాంతంలో వెలిశాయి. వీరు గుడ్లను రెండో దశలో రైతులకు అందిస్తున్నారు. అనంతరం వాటిని రైతులు మరో 25 రోజులు షెడ్లలో మేపితే పంట పూర్తవుతుంది. ఈమధ్య కాలంలో పంట ఆఖరి దశలోకి వచ్చాక పట్టుపురుగులను గూళ్లు అల్లడానికి చంద్రికల్లో వేస్తారు. సాధారణంగా పట్టు పురుగు 48 గంటల్లో గూడు అల్లుతుంది. కానీ, ఇప్పుడు చంద్రికల్లో వేసిన పురుగులు గూళ్లు కట్టకుండా అలాగే ఉండిపోతున్నాయి. దీంతో రెండ్రోజులు చూసి రైతులు నిరాశగా పురుగులను గుంతలు తవ్వి పూడ్చేస్తున్నారు.

సైంటిస్ట్‌ల పరిశీలన

చిత్తూరు, అన్నమయ్య, కదిరి, హిందూపూర్‌కు చెందిన సెరి కల్చర్ సైంటిస్ట్‌లు గత వారం పలమనేరు ప్రాంతంలోని ఏడూరు, అగ్రహారం, బేరుపల్లె తదితర గ్రామాల్లో గూళ్లు కట్టని పట్టుపురుగులను పరిశీలించారు. వాటి నోటి నుంచి లాలాజలం రాకపోవడంతో దారం రాక గూడు కట్టడం లేదని గమనించారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేకపోవడంతో ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

కర్ణాటకలోనూ ఇంతే..

దేశంలోనే ఎక్కువగా పట్టుగూళ్లను పండించే రాష్ట్రాల్లో కర్ణాటక తొలిస్థానంలో ఉంది. జిల్లాకు పొరుగునే ఉన్న కోలారు, మాలూరు, శ్రీనివాసపుర, చింతామణి, శిడ్లఘట్ట, రామనగరల్లోనూ పురుగులు గూళ్లు కట్టడం లేదు. దీంతో రెండ్రోజుల క్రితం మైసూరుకు చెందిన సెంట్రల్ సెరీ కల్చర్ రీసెర్చ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, చీఫ్ సైంటిస్ట్‌లు మూడు రాష్ట్రాల సెరికల్చర్ అధికారులతో వెబీబార్ నిర్వహించారు. దీని నివారణ చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు.

రూ.లక్షల్లో నష్టం

పట్టుపురుగులను ఏడాదికి ఆరు దఫాలు కొందరు, రెండు అదునులుగా సాగుచేసేవారైతే ఓ పంటకు 500 గుడ్లు మేపితే దాదాపు 400 కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతాయి. ఇప్పుడున్న ధర మేరకు కిలో రూ.500 అనుకున్నా రూ.రెండు లక్షలు వచ్చేది. కానీ గూళ్లు రాక రైతు నష్టపోతున్నాడు.

పరిశోధన చేస్తున్నాం



చాకీ సెంటర్లలో నిర్లక్ష్యం వల్ల పట్టుపురుగులు రెండో దశలోనే అన్‌ఈక్వల్స్ కనిపిస్తాయి. కాని అక్కడ ఆరోగ్యంగా ఉండే పట్టుగూళ్లకు కూడా రైతుల వద్దకు వచ్చేసరికి సమస్య వస్తోంది. భూమిలో రసాయనాలు పెరగడం, పురుగుమందులు, ఫెర్టిలైజర్స్ వాడకం తదితరాలతో మల్బరీ ఆకు నుంచి సమస్య వస్తోందనే మాట వినిపిస్తోంది. గతంలో రైతులకు సీఎస్ఆర్ రేస్(జాతి)పట్టుగుడ్లను ఇచ్చేవారు. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో మన గూళ్లు వెళ్లాలని ఫారిన్ రేసే గుడ్లను ప్రస్తుతం రైతులకు విక్రయిస్తున్నారు. గత పదేళ్లుగా ఇక్కడి రైతులకు ఎఫ్‌సీ-1, ఎఫ్‌సీ-2 రకం గుడ్లను అందిస్తున్నారు. రేస్ కాలం ఎక్కువ కావడంతో గుడ్లలోనే ఏదైనా సమస్య ఉందేమో అని పరిశోధన చేస్తున్నాం.

– కిషోర్ నాయక్, ఏడీ, సెరి కల్చర్

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 66,199 మంది స్వామివారిని దర్శించుకోగా 29,351 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.17 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.59,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75.00

ఆక్రమిత స్థలంలో ఫెన్సింగ్ తొలగింపు

కార్వేటినగరం : మండలకేంద్రంలోని సుద్దగుంట ఏఏ డబ్ల్యూలో ఓ ప్రభుత్వోద్యోగి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్తె ఆక్రమించిన స్థలాన్ని మంగళవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సదరు భూమికి వేసిన ఫెన్సింగ్‌ను తొలగించారు. వివరాలు.. 1976లో పక్కాగృహాల నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం సర్వే నంబర్ 178-4లో 1.22 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. 1996లో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పటి జెడ్పీచైర్మన్ గోవిందస్వామి అందులో 64 సెంట్లు కొనుగోలు చేసినట్లు రికార్డులు సృష్టించారు. 1996లో రిజిస్ట్రేషన్ సైతం చేయించుకున్నారు. అప్పటికే అందులోని కొంత భూమిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, మైదానం, తాగునీటి బావి ఏర్పాటు చేశారు. అయితే గోవిందస్వామి కుమార్తె వనజ తాను ప్రభుత్వోద్యోగి అయినప్పటికీ సదరు భూమిని ఆక్రమించుకుని ఫెన్సింగ్ కూడా వేయించేశారు. దీంతో పాఠశాలకు వెళ్లేందుకు కనీసం దారి లేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై గ్రామానికి చెందిన బాలసుబ్రమణ్యం అనే వ్యక్తి స్పందన కార్యక్రమం ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఎంఈఓ విజయ్‌కుమార్ గ్రామానికి వెళ్లి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి, ఫెన్సింగ్ తొలగించారు. ఆ స్థలంలో అంగన్‌వాడీ భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరారు.


ఫెన్సింగ్ తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

యువతి ఆత్మహత్య

గంగాధరనెల్లూరు : మండలంలోని బుక్కాపట్నంలో మంగళవారం రాత్రి సాయికృష్ణ(26) అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఇన్‌చార్జి ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన యువకుడితో ఆమె ప్రేమలో పడింది. అతను పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురై సూసైడ్ నోట్ రాసి ఇంట్లోనే బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామానికి చేరుకుని సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సాయికృష్ణ మృతదేహం

సచివాలయంలో పరికరాల ధ్వంసం

గుడిపాల: మండలంలోని 197రామాపురం సచివాలయంలోని పరికరాలను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన కోడిగుడ్లను సైతం పగులగొట్టారు. మంగళవారం పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మందుబాబు పనిగా నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పగిలిపోయిన సీపీయూ

17న బాలుర క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడా మైదానంలో ఈ నెల 17వ తేదీన అండర్-14 బాలుర జిల్లా జట్టు ఎంపిక పోటీలు జరుగుతాయని చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గరల్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు 2009 సెప్టెంబర్ ఒకటి నుంచి 2011 ఆగస్టు ఒకటో తేదీ మధ్యలో జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆ రోజు ఉదయం 8 గంటలలోపు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, సొంత క్రీడా సామగ్రి, తెల్లని దుస్తులతో హాజరవ్వాలని తెలిపారు. పూర్తి వివరాలకు 98490 26131, 79818 80381నంబర్లలో సంప్రదించాలన్నారు.

16న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో వర్సిటీలో ఈ నెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంప్లాయిమెంట్ అధికారి టి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేష్విన్, డైకిన్ ఎయిర్‌కండీషనింగ్, క్యాష్ కార్ప్, ది ప్రొఫెషనల్ కొరియర్ కంపెనీ ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొని అర్హులను ఎంపక చేస్తారన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'పోషకాహార' ఫ్లాష్‌మాబ్!


ఫ్లాష్‌మాబ్‌లో నృత్యం చేస్తున్న మహిళా వర్సిటీ విద్యార్థినులు

తిరుపతి సిటీ: మహిళా యూనివర్సిటీ హోమ్ సైన్స్, పదవ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థుల చేత ఆకర్షణీయమైన ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహభరితంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. నృత్యం ద్వారా ఆరోగ్యకరమైన జీవితం, ఆనందం కలుగుతుంద ని చెప్పే సందేశాన్ని ఫ్లాష్‌మాబ్ ద్వారా చాటిచెప్పారు. అనంతరం ఆహారాన్ని వృథా చేయడం వల్ల పర్యావరణం, సమాజంపై జరిగే పరిణామాలను విద్యార్థులు సృజనాత్మకంగా చిత్రీకరించారు. పోషకాహార మాసంగా ఈనెలలో జరగబోవు ఈవెంట్లకు సంబంధించిన బ్రోచర్‌ను వీసీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ రజనీ, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పవిత్ర పరిమళం!


ధ్వజస్తంభాన్ని నీటితో శుద్ధి చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆనందనిలయం మొదలుకుని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. – తిరుమల

సుస్థిర జీవనోపాధే ప్రధాన లక్ష్యం

- వెటర్నరీలో రెండు రోజుల జాతీయ సదస్సు
- అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య


మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య

తిరుపతి సిటీ: రైతుల సంక్షేమం, సుస్థిర గ్రామీణ జీవనోపాధి ప్రధాన లక్ష్యం అని, ఆ దిశగా ఎస్వీ వెటర్నరీ కళాశాల విస్తరణ విభాగం పనిచేస్తుందని ఆ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య అన్నారు. మంగళవారం ఎస్వీ వెటర్నరీ కళాశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. సుస్థిర గ్రామీణ జీవనోపాధి అనే అంశంపై ఈనెల 14, 15వ తేదీల్లో కళాశాలలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రకృతి, వాతావరణంలో మార్పులు, ఆర్థిక, సామాజిక, సాంకేతిక అంశాలపై ఈ సదస్సు దృష్టి సారించనుందన్నారు. ప్రధానంగా ఐదు అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ జీవనోపాధిలో ఎదుర్కొనే సమస్యలు, సవాళ్లు, విధి విధానాలుపై, వ్యవసాయం అనుబంధ శాఖలపై, గ్రామీణ మహిళలు, ప్రభుత్వ పాత్రపై సదస్సు దృష్టి సారిస్తుందన్నారు. అలాగే ఇన్‌ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ వంటి విషయాలపై నిశితంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులకు ముఖ్యఅతిథిగా ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ, పశుసంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ గోపాలక్రిష్ణ ద్వివేది హాజరవుతారని తెలిపారు. తమిళనాడు, తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, రాజస్థాన్, కేరళ, గోవా రాష్ట్రాల నుంచి 200 మంది పశువైద్య శాస్త్రవేత్తలు, పలు యూనివర్సిటీల నుంచి వీసీలు, అధ్యాపకులు, విద్యార్థులు, పెద్దసంఖ్యలో హాజరవుతున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో విస్తరణ విభాగాధిపతి డాక్టర్ జీఆర్‌కే శర్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ త్రివేణి పాల్గొన్నారు.

విభిన్నంగా ఆలోచిద్దాం!


తిరుపతి ఐఐటీలో యువ శాస్త్రవేత్తలు, విద్యార్థులు

రేణిగుంట: దేశంలో మున్ముందు మరిన్ని ఆవిష్కరణల వైపు యువ శాస్త్రవేత్తలు అడుగులు వేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో మంగళవారం సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్స్‌పై జాతీయ సదస్సు జరిగింది. తిరుపతి ఐఎస్‌టీఎఫ్, విజ్ఞాన భారతి, తిరుపతి ఐఐటీ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహించాయి. నిపుణులు, మేధావులు పాల్గొన్నారు. యువ శాస్త్రవేత్తలు విభిన్నంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఐఎస్‌టీఎఫ్ అధ్యక్షుడు నారాయణ రావు, విజ్ఞాన భారతి డైరెక్టర్ కొంపెల్ల శాస్త్రి ఈ సదస్సుకు ఏర్పాట్లు చేశారు. నీతి అయోగ్ సభ్యులు పద్మభూషణ్ డాక్టర్ విజయకుమార్ సారస్వత్, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవిచంద్రన్, శాంతా బయోటెక్ చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, డీఆర్‌డీఓ ఈసీఎస్ డైరెక్టర్ జనరల్ బీకే.దాస్ పాల్గొన్నా. సీఐఎస్ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్.కలైసెల్వి వర్చువల్ విధానంలో పాల్గొని ప్రసంగించారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి తుడా:తిరుపతి జిల్లాలో 104, 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవర్ పోస్టుల కు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్లు ఎస్వీ.శేషసాయన్నరెడ్డి, వీ.సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణులైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి , మూడేళ్ల అనుభం ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తులను అందించాల ని పేర్కొన్నారు. 104 సర్వీసులో తిరుపతిలో ఒక పోస్టు, పాపనాయుడుపేటలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నా రు. అదేవిధంగా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ లో తిరుపతిలో 7, పుత్తూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, కోట మండలాల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నట్టు వెల్లడించారు. అభ్యర్థులు దరఖాస్తులను తిరుపతి మున్సిపల్ పార్క్ సౌత్ స్ట్రీట్‌లోని 104, 108 కార్యాలయంలో అందజేయాలని కోరారు.